# డుయూ లవ్ మీ

భైరవయ్య

ఆ గది వైశాల్యం నూటముప్పై చదరపు అడుగులు. ఆ గది గోడలు కొత్తగా సున్నం రాయించుకున్నట్టున్నాయి. ఆ గదిలో లైటు అరవై కొవ్వొత్తుల కాంతినిస్తోంది. ఆ లైటుకి సరిగ్గా కింద ఇరవై నాలుగు చదరపు వైశాల్యమున్న పందిరి పట్టుమంచం. ఆ మంచం వయసు చెప్పడం కష్టం. ఆ మంచం పట్టిమీద అంటీ అంటనట్టు కూర్చున్నాడు గోపాలం. అతని వయస్సు ఇరవై ఆరు. అతని నుదుట తిలకముంది. బుగ్గమీద చుక్క బొట్టుంది. కళ్ళు తలుపు వేపున్నాయి. ఆలోచనలు ప్రసన్నలక్ష్మీమీదున్నాయి. ఆ గదిలోకి ప్రసన్నలక్ష్మి ఇంకా రాలేదు. గోపాలానికి బెరుగ్గా వుంది. ఏమిటో ఖంగారుగా వుంది. ఇంతవరకు అతను ప్రసన్నలక్ష్మితో మాట్లాడలేదు. ఆమెకి తనపట్ల ప్రేమ వుందో లేదో తెలుసుకోవాలి అనుకున్నాడు.

* * *

గోపాలం చాలా బుద్ధిమంతుడు. తెలుగు దేశంలో వున్న అనేకమంది గోపాలాల్లో అతను ఒకడు. యూనివర్సిటీ వాళ్ళు "యూ ఆర్ బీస్టు గ్రాడ్యుయేట్" అన్నాక, "ఇహ చాల్లే మనూరి కాలేజీలో లెక్చరరుద్యోగం ఖాళీగా వుంది. నేను చైర్మన్‌గారితో మాట్లాడాను. వెళ్ళి కలు. ఏమంటావ్?" అన్నాడు గోపాలం తండ్రి.

గోపాలం లెక్చరరయిన సంవత్సరానికి, "ఒరేయ్ అబ్బాయ్, రేపు కాలేజీకి సెలవు పెట్టు. బెజవాడెళ్ళి పిల్లని చూసి రావాలి. నేనూ, మీ అమ్మా చూశాం. మాకు నచ్చింది. నువ్వుకూడా ఓసారి చూద్దుగాని. ఏవంటావ్?" అన్నాడు గోపాలం తండ్రి.

గోపాలం పిల్లని చూశాడు. ఆ అమ్మాయి పేరు ప్రసన్నలక్ష్మి. వయసిరవై యేళ్ళట. అందంగానే వుంది. నాజూగ్గా కూడా వుంది. గోపాలాన్ని ఒకసారి తలెత్తి చూసింది. గోపాలం బెరుగ్గా చూశాడు. ఆ అమ్మాయి నచ్చినట్టనిపించింది గోపాలానికి.

గోపాలం తల్లికేసి తిరిగి మెల్లిగా గొణిగాడు. గోపాలంతల్లి, గోపాలం తండ్రివేపు తిరిగి మెల్లిగా ఏదో చెప్పింది. గోపాలం తండ్రి ఓసారి గోపాలంవేపు కనుబొమలు పైకెత్తి నవ్వుతున్నాడో—ఉరుముతున్నాడో తెలియనట్టు చూసి, "అన్నట్లు బావగారూ, పిల్లా పిల్లాడూ ఏవన్నా మాట్లాడుకుంటారేమో మనం అలా బైటికి వెళదాం రండి" అని లేచాడు. ఆ మాటందుకుని, "రండి వదినగారూ మా ఇల్లు చూద్దురుగాని" అని ప్రసన్నలక్ష్మి తల్లి లేచింది.

గోపాలం, ప్రసన్నలక్ష్మి యిద్దరే మిగిలారు.

గోపాలం గొంతుక మండుటెండలో పరిగెత్తుకొచ్చినట్టు ఎండిపోయింది.

ప్రసన్నలక్ష్మి గోపాలాన్ని చూస్తోంది.

గోపాలం కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు.

"ఫరవాలేద"న్నట్టు నవ్వుకున్న ప్రసన్నలక్ష్మి గాజులు చప్పుడు చేసింది.

గోపాలం ప్రసన్నలక్ష్మికేసి చూశాడు.

ప్రసన్నలక్ష్మి కళ్ళు సన్నగా నవ్వాయి.

"మీరు .... మరి .... బి. ఏ. చదివారా?" అన్నాడు గోపాలం.

"మరే—ఏం చెయ్యాలో తోచక" అన్నట్టు తలాడించింది ప్రసన్నలక్ష్మి.

"మరి....ఆపైన చదవలేదేం?"

"నాకు చదువంటే ఇష్టం లేదండీ."

"ఏం....ఎందుకు?"

సన్నగా నవ్వింది ప్రసన్నలక్ష్మి.

"అబ్బ, ఈ అమ్మాయి ఎందుకింత బాగా నవ్వుతుంది" అనుకున్నాడు గోపాలం.

"మీరెందుకు ఎమ్మెస్సీతో ఆపేశారు?" అనడిగింది ప్రసన్నలక్ష్మి.

"మా నాన్నగారుద్యోగం చెయ్యమన్నారు" అన్నాడు గోపాలం.

అలా అంటున్న గోపాలం మూతిని ఆ మట్టున కొరకాలనిపించింది ప్రసన్నలక్ష్మికి. ప్రసన్నంగా చూస్తూ కూర్చుంది.

"ఓ చిన్నమాట" అన్నాడు గోపాలం.

"ఏమిటన్నట్టు" చూపింది ప్రసన్నలక్ష్మి.

"మరి....మరి....నేనంటే మీ కిష్టమేనా?" అన్నాడు గోపాలం.

అతన్ని ఓరగా చూస్తూ నవ్వింది ప్రసన్నలక్ష్మి.

'ఇంత బాగా ఎందుకు నవ్వుతుంది' అని మళ్ళీ అనుకున్నాడు గోపాలం.

గోపాలానికి ప్రసన్నలక్ష్మికి పెళ్ళయింది.

* * *

తలుపుదగ్గర చప్పుడయింది. గోపాలం చూశాడు. ప్రసన్నలక్ష్మి లోపలికొచ్చింది.

వెనక తలుపులు మూసుకున్నాయి.

గోపాలం మెల్లిగా "ప్రసన్నా!...." అన్నాడు.

ప్రసన్నలక్ష్మి గోపాలాన్ని సూటిగా చూసింది.

"ఇలారా" అన్నాడు.

ఆమె కళ్ళు నవ్వుతున్నాయి. అందులో చిలిపితనముంది.

ఆమె కదల్లేదు.

గోపాలం బెరుగ్గా అడుగులేస్తూ ఆమె దగ్గరకెళ్ళి నిలబడ్డాడు.

ప్రసన్నలక్ష్మి పెదాలు నవ్వుతున్నాయి. ఆ పెదాలు తడిగా వున్నాయి.

ఆమె చేతిని పట్టుకున్న అతని చెయ్యి వణుకుతోంది.

"ప్రసన్నా!" అన్నాడు.

"ఇలా నిలబడటమెందుకు. అక్కడ కూచుందాం రండి" అంది మెల్లిగా.

మంచంమీద కూర్చున్న ప్రసన్నలక్ష్మి కళ్ళలోకి చూస్తూ, "నన్ను ప్రేమిస్తున్నావా ప్రసన్నా?" అన్నాడు.

ప్రసన్నలక్ష్మి నవ్వింది.

నవ్వుతున్న ఆ పెదాల్ని చూసి ఆగలేకపోయాడు గోపాలం.

* * *

ప్రసన్నలక్ష్మి గోపాలం దగ్గరకొచ్చి ఏడాదయింది. గోపాలం ప్రశ్నకి సమాధానం మటుకు దొరకలేదు. గోపాలానికి ప్రసన్నలక్ష్మి అంటే చాలా ఇష్టం. ప్రసన్నలక్ష్మి కూడా గోపాలంపట్ల చాలా ఇష్టంగానే వుంటుంది. అతని అవసరాలు అన్నీ గమనించి, అతనికి కావలసినవి అమరుస్తుంది. కాలేజీకి వెళ్ళేముందు చొక్కా గుండీలు పెడుతుంది. టై కట్టుకున్నప్పుడు టై నాట్ సరిచేస్తుంది. జోళ్ళు పాలిష్‌చేసి పెడుతుంది. వెళ్ళేముందు ముద్దునిచ్చి సాగనంపుతుంది. కాలేజీనుంచి వచ్చి గదిలోకి రాగానే అతనికి

ఊపిరాడకుండా ముద్దు పెట్టుకుంటుంది.

ప్రసన్నలక్ష్మితో ప్రతిరాత్రీ ఒక దివ్యమైన అనుభవం గోపాలానికి.

అయినా గోపాలం ప్రశ్న ప్రశ్నగానే వుండిపోయింది.

"నన్ను ప్రేమిస్తున్నావా?" అని ఎన్నిసార్లడిగినా ప్రసన్నలక్ష్మి అందంగా నవ్వుతుందే తప్ప సమాధానం ఇవ్వదు. గోపాలానికి అదొక్కటే బాధగా వుంది. అతని మనసులో అనుమానంగా కూడా వుంది. ఆమె అందిస్తున్న ఆనందం చూసి తన అనుమానాన్ని పైకి చెప్పలేకపోతున్నాడు. అదీగాక తనున్నా పైకంటే—ఏమనుకుంటుందో, తనని అసహ్యించుకుంటుందేమోనని భయం అతనికి. ఆ అనుమానం అతన్ని ముల్లులా గుచ్చుతోంది.

ఓ అందమైన రాత్రి—అతని అరచేతిలో మున్నాళ్ళు చుడుతూ "యూవిల్ బి ఎ ఫాదర్ షార్ట్లీ" అని ప్రసన్నలక్ష్మి చెప్పినప్పుడు ఛాతీ పొంగించుకున్నాడు గోపాలం. ఆమె పెదాలమీద—ఆ నవ్వులమీద గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు. అలా ముద్దు పెట్టుకుంటున్నప్పుడు, "ఈ రోజు ఎలాగైతేనేం సమాధానం తీసుకోవాలి" అని నిర్ణయించుకున్నాడు.

ప్రసన్నలక్ష్మి రెండు చేతులూ పట్టుకుని, కళ్ళలోకి చూస్తూ, "ప్రసన్నా!.... ఎప్పుడడిగినా నువ్వు సమాధానం చెప్పటం లేదు. ఈ రోజు నువ్వు చెప్పకతప్పదు.... మొదట్నించీ నాకు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుండేది. నేను భయస్తుణ్ణి. అది నీకు తెలుసు. అందుకనే ఏ అమ్మాయినీ తేరిపార చూసేవాణ్ణి కాదు. మా నాన్నంటే మరీభయం. నిన్ను చూసినప్పుడు, నీతో మాట్లాడినప్పుడు నాకు ధైర్యం వచ్చింది.. అందుకే నిన్ను ప్రేమించాను. నువ్వు అందంగా వుంటావు. పెళ్ళైన దగ్గర్నుంచి నిన్ను చూస్తున్నానుగా. నిన్ను ప్రేమించడంలో పొరపాటు చెయ్యలేదని నమ్మకం కలిగింది. నిన్ను చాలా ఇదిగా ప్రేమిస్తున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నట్టు నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదోఅని అనుమానం.... అందుకేఇన్నిసార్లుఅడుగుతున్నాను ప్రసన్నా.... నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?" అన్నాడు గోపాలం ఆర్తితో.

ప్రసన్నలక్ష్మి గోపాలాన్ని చూపింది. సందేహం తీర్చుకోడానికొచ్చిన శిష్యుణ్ణి గురువు చూసినట్టు సూటిగా చూపింది. అమాయకంగా ఒడిలో ఒదిగిపోతున్న బిడ్డని తల్లి చూసినట్టు జాలిగా చూసింది. తనని నిలదీస్తున్న ప్రియుణ్ణి ప్రియురాలు చూపినట్టు నిర్భయంగా చూపింది. అతని కళ్ళల్లో ఆర్తిపీ, అనుమానాన్ని చూపింది. ఆమె కళ్ళల్లో చిరునవ్వు చెరగలేదు.



"చూడండీ—ప్రేమ కర్థం నాకు తెలియదు. సినిమాల్లోనూ, నవలల్లోనూ ప్రేమ చూశాను, చదివాను. నా కెందుకో ఆ ప్రేమ నచ్చలేదు. మీరు ఇన్నిసార్లడిగినా నేను సమాధానం చెప్పకపోతే, పెళ్ళి కాకముందు నే నెవర్నైనా ప్రేమించానేమోనని మీరు అనుమానపడుతూ వుండొచ్చు. ఆ విషయంలో మీరు అనుమానించనవసరం లేదని మీకు హామీ ఇస్తున్నాను.

ప్రేమ అనేది—ముఖ్యంగా మీరనుకొన్న ప్రేమ—పురుషుడికీ, స్త్రీకీ మధ్య వుండాల్సిన ప్రేమ—ఒక రోజులో పుట్టేది కాదు. అది మెల్లిగా, సాన్నిహిత్యంవల్లా, ఒకరిమీద ఒకరికున్న అనురాగంవల్లా పెరిగి పెద్దదై విడదీయని బంధమవుతుంది.

మనిద్దరిమధ్య వున్నది ప్రేమేనా అంటే నేను చెప్పలేను. ఇద్దరం వయసులో వున్నాం. కోర్కెలున్నాయి. వాటికి శాశ్వతత్వం ఇవ్వడానికి వివాహ వ్యవస్థుంది. ప్రస్తుతం మనకి ఒకరిపట్ల ఒకరికి ఆకర్షణ కలగడానికి కారణం—ఒకరిపట్ల ఒకరికున్న కోర్కె. ఆ కోర్కె ఉధృతం తగ్గాక కూడా మనిద్దరిమధ్య అంత బలమైన ఆకర్షణ మిగిలి వుంటే అప్పుడుపుట్టేది ప్రేమ అనుకుంటాను.

నాకు మీరు కావాలి. మీ దృఢమైన శరీరం కావాలి. మీకు నాపట్ల ఆకర్షణుంది. మీరన్నట్లు ప్రేముంది. మరో మగాడి అవసరం నాకు లేదు. మీరొక్కరే నాకు చాలు.

మీరు మీ భావాల్లో జీవిస్తారు. నిజాన్ని సూటిగా ఒప్పుకోడానికి జంకుతారు. అబద్ధం చెప్పడం నా కిష్టంలేదు. అందుకే మీకు సమాధానం చెప్పలేదు.

ఈ రోజు కూడా చెప్పకపోదును. నాపట్ల మీరు అనుమానం పెంచుకోవడం నేను భరించలేను. అవును మీ మాటల్లో చెప్పాలంటే, ఐనీడ్ యూ అండ్ సో ఐ లవ్ యూ."

ఈ మాటలంటున్నప్పుడు ప్రసన్నలక్ష్మి నవ్వలేదు. ఆమె చేతులు తన ఒడిలో వున్న గోపాలం ముఖాన్ని పట్టుకున్నాయి. ఆమె పెదాలు అతని కళ్ళని ముద్దుపెట్టుకున్నాయి.

గోపాలానికేమిటో తృప్తిగావుంది. ప్రసన్నలక్ష్మిముందు తను చాలా చిన్నవాణ్ణనే భయం కలిగింది. అందుకే ఆమె నడుంచుట్టూ చేతులేసి ఒడిలో తల పెట్టి పడుకున్నాడు. ***